మధుకర్ నోట అలాంటి మాట వస్తుందని వూహించలేదు అశోక్ కుమార్ -- వందల రూపాయల పాకెట్‌మనీని ఫ్రెండ్స్ కోసం విచ్చలవిడిగా ఖర్చుచేసిన మధుకర్ ఈ రోజు ఇలా .....

"ప్రస్తుతం మా పెట్రోల్‌బంక్‌లో ఇద్దరు మేనేజర్లం వున్నాం. ఒకరు డే చూస్తాడు. రెండోవ్యక్తి నైట్. నైట్ మానేజర్ ఓ రెణ్ణెళ్ళు సెలవు పెట్టాడు. నువ్వు చేస్తానంటే మా ఓనర్‌తో చెప్తాను. ..... "

ఇద్దరూ బయటికొచ్చారు. స్కూటర్ క్రాస్ రోడ్స్‌వేపు వెళుతున్నప్పుడు అడిగాడు మధుకర్ .

"సాలరీ ..... ఎంతుంటుందిరా ..... "

"సిక్స్ హండ్రెడ్ ..... " అంటూ మధుకర్ ఏమంటాడోనని ఆగాడు అశోక్ కుమార్.

మధుకర్ ఏమీ అనలేదు.

అశోక్ కుమార్, బంక్ ఓనర్‌తో మాట్లాడాడు.

"ఆ కుర్రాడ్ని ఎక్కడో చూసినట్టుందే ..... నైట్ డ్యూటీ చెయ్యగలడా ..... " సందేహం వ్యక్తం చేసాడు ఓనర్.

"వీడి తరుపున నేను హామీ సర్ ..... " అశోక్ కుమార్ భరోసా ఇచ్చాడు. ఎన్నో సార్లు అదే బంక్‌లో పెట్రోలు పోయించుకున్నాడు.

ఎన్నోసార్లు ఆ ఓనర్ అక్కడ నిలబడగా చూసాడు. పనిలో పనిగా ఓ మూడు వందలు అశోక్ కుమార్ దగ్గర అప్పు కూడా తీసుకున్నాడు మధుకర్ .

రోజూ రాత్రి ఏడు గంటలనుంచి, ఒంటిగంట వరకు డ్యూటీ.

అప్పుడు టైమ్ అయిదయింది.

"ఆలస్యమెందుకు. ఇవాళనుంచే డ్యూటీ కొచ్చెయ్--" అన్నాడు అశోక్ కుమార్ .

"సరిగ్గా ..... ఏడు గంటలకొస్తే సరిపోతుందికదా."

బయటకొచ్చాడు.

తనకు అర్జంటుగా ఓ రూం కావాలి. ఎంతో సేపు అన్వేషణ సాగించగా చిన్న గది దొరికింది. ఆ గది కూర్చుంటే విశాలంగానూ పడుకుంటే ఇరుగ్గానూ వుంటుంది. అలాంటిగది అది.

*            *            *            *

జీవితంలో మొట్టమొదటసారి ఓ చిరుద్యోగం చేసి రూమ్‌కొస్తున్న మధుకర్‌కి ఓ కొత్త ప్రపంచంలోకి ప్రవేశించినట్టుగా అన్పించింది.

మర్నాడు, మధ్యాహ్నం నాలుగుగంటలవేళ--

శంకర మఠంలోని సత్కార్ హోటల్‌కెళ్ళాడు మధుకర్ . అప్పటికే అక్కడ వెయిట్ చేస్తోంది సుధారాణి .

"హోయ్ బాసూ ..... అటు మహతి, ఇటు నువ్వు ఇద్దరూ సడన్‌గా ఇలా మారిపోతే ఎలా? ఒక్కసారి కాలేజీకొచ్చి చూడండి. విద్యార్థులెలా అల్లల్లాడిపోతున్నారో ..... " కాఫీ తాగుతూ అంది సుధారాణి .

"మహతి ఎడ్రస్ కనుకున్నావా ..... " తనకు కావాల్సిన ప్రశ్న అడిగాడు మధుకర్.

"తనకోసం ప్రయత్నించొద్దని ..... ఎపుడో ..... సడన్‌గా తనే కలుస్తానని ఫ్రెండ్స్‌కి చెప్పిందట. ఎక్కడుందో తెలీదు ..... "

"ఎప్పుడయినా మహతి కనిపిస్తే నాకు ఇన్‌ఫార్మ్ చెయ్యడం మరిచిపోకు" బిల్లు చెల్లించి బయటకొచ్చాడు.

"మధూ ..... సాయంత్రం బార్లో కూర్చుందాం ..... నీతో తాగాలని ..... నాకెన్నాళ్ళనించో కోరిక ..... " అలా అడుగుతున్న సుధారాణి వేపు నిర్లిప్తంగా చూసాడు మధుకర్ .

"నేనంటే నీకిష్టమని నాకు తెల్సు సుధా ..... థాంక్ యూ ఫర్ యువర్ ఆఫర్" మరో మాట మాట్లాడకుండా ముందుకు కదిలోపోయాడు మధుకర్ .

నిశ్చేష్టితురాలై అలా చూస్తూ వుండిపోయింది సుధారాణి .

*  *  *  *

నెలరోజులు గడిచిపోయాయి.

స్టిచ్‌వెల్ టైలరింగ్ షాప్ ఓనరు వనజాక్షి ఎదురుగా కూర్చుంది మహతి. ఆ సమయంలో వనజాక్షి చాలా ఆనందంగా వుంది.

"నీలాంటి స్కిల్డ్ వర్కర్స్ నాదగ్గరుంటే, నేనెన్నో వండర్స్ చేయగలను" అంటూ డ్రాయరులోంచి రెండువేల రూపాయల్ని తీసి, మహతి చేతిలో పెట్టింది.

ఆ డబ్బును లెక్క పెట్టుకుని విస్మయంగా చూసింది మహతి.

"వాట్ మేడమ్. ఒన్ మంత్ సాలరీని ఎడ్వాన్స్‌గా ఇచ్చారా ..... "

"లేదు మహతి. ఇది సాలరీ. నీకు చెప్పడం మరిచిపోయాను ..... నువ్వు డిజైన్ చేసిన హానీబీ బేబీ ఫ్రాక్‌కి మంచి ఆర్డర్స్ వచ్చాయి. ఛర్మాన్స్ కంపెనీ యాభైవేల ఫ్రాక్‌లకు ఆర్డరిచ్చింది. అందుకే ఈ సాలరీ ..... ఈ సారి నుంచి నువ్వు పూర్తిగా డిజైనింగ్ మీదే కాంసన్‌ట్రేట్ చెయ్యి ..... నీకో అసిస్టెంట్‌ను కూడా ఇస్తాను."

వనజాక్షి అలా అంటున్నప్పుడు, ఆనందోద్వేగంలో ఉక్కిరిబిక్కిరయింది మహతి-జీవితంలో తను సాధించిన తొలి విజయం ..... "థాంక్యూ మేడమ్ ..... " అంది తడిదేరిన కళ్ళతో. అంతలో ఏదో జ్ఞాపకం రావడంతో "టూ అవర్స్ పర్మిషన్ కావాలి మేడమ్" అని అడిగింది. ఎందుకని అడక్కుండానే పర్మిషన్ ఇచ్చింది మేడమ్.

బ్యాంక్ ఎకౌంట్ జ్ఞాపకం వచ్చింది మహతికి- అందుకే పర్మిషన్ తీసుకుంది. బయటకొచ్చింది. మెహిదీపట్నం వెళ్ళే బస్సు కోసం ఎదురుచూస్తూ నిల్చుంది.

మొదటి నెల జీతం అందుకుని, ఆ ఆరువందల రూపాయల్ని ఆప్యాయంగా చుసుకున్నాడు మధుకర్ .

తను మొట్టమొదట చెయ్యాల్సిన పని బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చెయ్యడం. నారాయణగుడా బస్టాప్‌లో మెహిదీపట్నం వెళ్ళే బస్సుకోసం నిలబడ్డాడు.

వరసగా రెండు బస్సులు వెళ్ళిపోయాయి. జనం విపరీతంగా ఉండడంతో, ఆ తర్వాత బస్సెక్కుదామనుకున్నాడు. వెళ్ళిపోయిన బస్సుల్లో రెండో బస్సులో మహతి ఉందని తెలీదు.

ఆ బస్సులు వెళ్ళిపోయాక నలభై నిమిషాలకి గానీ ఇంకో బస్సు రాలేదు.

*　　*　　*　　*

బ్యాంక్‌లోనికొస్తున్న మహతిని చూడగానే, బ్యాంక్ మేనేజర్ నోరెళ్ళబెట్టాడు. ఆమె అక్కడకు అలా వస్తుందని ఊహించలేదు. గబగబా సీటులోంచి లేచి “హలో మేడమ్ హౌ ఆర్యూ. ప్లీజ్ కమిన్ ..... ” తనకెంతో తెల్సినట్టుగా విష్ చేస్తున్న బ్యాంక్ మేనేజర్‌వేపు సంశయంగా చూసింది మహతి.

“నేను కంట్రీ క్లబ్ మెంబర్ని ..... ఆ రోజు ఆ సెన్సేషనల్ ప్రోగ్రామ్‌కి నేను ఎటెండయ్యాను.”

ఓ బ్యూటీక్వీన్ తన ఛాంబర్‌లో ఉందన్న ఆనందంతో తబ్బిబ్బయిపోతున్నాడు మేనేజర్.

“వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ మేడమ్”

“సేవింగ్స్ ఎకౌంట్స్ ఓపెన్ చెయ్యాలి సర్ ..... ” ఆ మాటనడం తరువాయి అవసరమైన ఫార్మాలటీస్ అన్నీ తను పూర్తి చెసాడు.

“ఎమౌంట్ ఎంత క్రెడిట్ చేస్తున్నారు” అడిగాడాయన.

“మినిమమ్ ఎంతండీ.”

చెప్పాడాయన.

“అయితే ..... టూ హండ్రెడ్ ..... ” ఆ మాటకు పిచ్చెత్తిపోయాడు. బ్యాంక్ మేనేజర్. “టూ హండ్రెడ్ ఓన్లీ ..... ” అని కంగారుగా చాలా సార్లు అనుకుని రాసి ఎకౌంట్ బుక్‌ను చేతికిచ్చాడు.

బ్యాంక్ ఫోన్ నెంబర్ని రాసుకుని, థాంక్స్ చెప్పి బయటకొచ్చి బస్సెక్కింది. మహతి బ్యాంక్‌లోంచి బయటకొచ్చిన పది నిమిషాలకు లోనికి అడుగుపెట్టాడు మధుకర్.

మళ్ళా మరో షాక్ బ్యాంక్ మేనేజర్‌కి, మధుకర్ ఫోన్ చేస్తే చాలు ..... తనలాంటి కొన్ని వందలమంది బ్యాంక్ మేనేజర్లు డిపాజిట్లు కోసం అతని దగ్గరకు పరిగెడతారు.

ది గ్రేట్ ఇండస్ట్రియలిస్ట్ రాఘవేంద్ర నాయుడు కొడుకు, మధుకర్ స్వయంగా బ్యాంక్‌లోకి రావడాన్ని వెంటనే జీర్ణం చేసుకోలేకపోయాడు. ఇవాళ తన జీవితం ధన్యమైపోయిందనుకున్నాడు మేనేజర్. మధుకర్ ఊ అంటే చాలు కొన్ని లక్షల రూపాయలు డిపాజిట్లుగా వస్తాయి. మధుకర్ సేవింగ్స్, ఎకౌంట్ గురించి ఇన్‌ఫర్‌మేషన్ అడగడంతో మేనేజర్ ఫార్మాలిటీస్ స్వయంగా పూర్తిచేసి- ఆశగా, ఆసక్తిగా మధుకర్ మొహంలోకి చూసాడు.

“మినిమమ్ ఎంత సర్ ..... ” అలా మధుకర్ అడుగుతాడని ఊహించలేదు బ్యాంక్ మేనేజర్.

“హండ్రెడ్ రూపీస్ ..... అనుకోండి” వినయంగా అన్నాడు. మరేం మాట్లాడలేదు. మధుకర్ జేబులోంచి డబ్బుతీసి అందులోంచి వందరూపాయలు తీసిచ్చాడు.

దబ్‌మని ఛైర్‌లోంచి కిందపడిపోయినట్టయింది బ్యాంక్ మేనేజర్‌కి.

“ఆర్ యూ ..... జోకింగ్ సర్” ఉండబట్టలేక అడిగేసాడాయన.

“నో ..... నో ..... అయామ్ నాట్ జోకింగ్ ..... ”

ఎకౌంట్‌బుక్‌ను చేతికిచ్చి అలా గుడ్లప్పగించి చూస్తుండిపోయాడు.

మధుకర్ లేచి బయటికెళ్ళి అంతలోనే తిరిగి వెనక్కి వచ్చి “మహతి అనే ఆవిడ ఎకౌంట్ ఓపెన్ చేసారా” అనడిగాడు.

“అవున్సార్ ..... ఆవిడ ఈవాళ ఓ పావుగంట క్రితమే ఎకౌంట్ ఓపెన్ చేసి వెళ్ళారు సర్ ..... ”

“థాంక్యూ ..... ” వెనక్కొచ్చేసాడు.

అది కలో సిటిజన్ క్లబ్‌లోలా జరుగుతున్న మరో మాయో అర్థం కాలేదు బ్యాంక్ మేనేజర్‌కి.

వెళ్ళిపోతున్న మధుకర్ వేపు, జారిపోతున్న కళ్ళద్దాల్ని పట్టించుకోకుండా చుస్తూ ఉండిపోయాడాయన.

*                    *                    *                    *

వనజాక్షి ఛాంబర్‌లో ఏదో డిజైన్ విషయమై డిస్కస్ చేస్తోంది మహతి. అదే సమయంలో ఓ వ్యక్తి డోర్ తెరచుకుని లోపలికి వచ్చాడు.

“హలో సార్. ఎన్నాళ్ళయింది. మిమ్మల్ని చూసి చాల్రోజులకొచ్చారు. ఈ మధ్య సిటీకి రావడంలేదా” ఆ వ్యక్తి  కుర్చీలో కూర్చున్నాడు. ఆ వ్యక్తి పొడవుగా ఉన్నాడు. దాదాపు అరవై ఏళ్ళుంటాయి. చూడగానే మనిషి పెద్దతరహాగా కనిపిస్తాడు.

“మళ్ళీ వస్తాను మేడమ్” మహతి లేచి, తన సీటులోకి వచ్చేసింది. మరో అరగంట తర్వాత ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయాక మహతి వెళ్ళింది.

కాసేపు ఏం మాట్లాడలేదు. వనజాక్షి- టేబిల్‌లోంచి చెక్ బుక్ తీసి పదివేల ఎమౌంట్‌కు చెక్ రాసి బోయ్‌కిచ్చి కేష్ తెమ్మని చెప్పింది బాధగా.

"ఇందాక వచ్చినాయన ఎవరో తెల్సా. రఘురామశెట్టి. టెక్స్‌టైల్ వరల్డ్‌లో ఒకప్పుడు కింగ్ ఆయన. ఇవాళ టెక్స్‌టైల్ వరల్డ్‌లో ఇన్నిఫ్యాషన్స్ వచ్చాయంటే దానిక్కారణం ఆయనే. రఘురామశెట్టి అంటే ఎవరికీ తెలియకపోయినా, జన్నీ ఫ్యాబ్రిక్స్ అంటే అందరికీ తెలుస్తుంది" అని అడిగింది ఆమె ఒక్కక్షణం.

"జన్నీ ఫ్యాబ్రిక్స్ ..... మా చిన్నప్పుడు జన్నీ ..... జన్నీ అని అందరూ చెప్పుకునేవారు మేడమ్. నాకు బాగా జ్ఞాపకం"

"అవునమ్మా ..... ముప్ఫయి ఏళ్ళు సూరత్‌లో వ్యాపారం చేశాడు. లక్షలు గడించాడు. స్వంత వూరికి వచ్చేద్దామని నిర్ణయించుకున్నాడు. భువనగిరి వచ్చేశాడు. ఎక్స్‌పెరిమెంట్స్ అంటే ఆయనకు చాలా ఇష్టం. ఇండియాలో మొట్టమొదటి ఇండియన్ జీన్స్‌ని ప్రవేశపెట్టింది ఆయనే.

టెక్స్‌టైల్స్‌లో మరో బొంబాయి అనే పేరు భువనగిరికి రావడానికి కారణం రఘురామశెట్టిగారే. యూత్‌ని ఆకర్షించేవిధంగా వస్త్రాలుండాలని మామూలు నూలుతో పాటు, శాన్ఫరైజ్డ్ నూలుని కూడా జతచేసి జీన్స్ బట్టలను తయారుచేసాడు.

పది కోట్ల రూపాయల వ్యాపారాన్ని ఆశించాడు. కానీ ఆశించిన సేల్స్ జరగలేదు. అందుకు ప్రత్యర్థుల ప్రచారం కూడా ఒక కారణం కావచ్చు. ఆయన మీద కోపంగావున్న మిగతా మిల్స్ యాజమాన్యాలు డూప్లికేట్ క్లాత్‌ని తయారుచేసి, అంతకన్నా తక్కువగా అమ్మడంవల్ల ఈయన సరుకు ఎక్కడికక్కడ అలాగే ఉండిపోయింది. దాదాపు తొమ్మిది కోట్ల రూపాయల క్లాత్ ఆయన మిల్స్‌లో పడుంది.

ఫ్యాక్టరీ మూతబడింది. వందలాదిమంది కార్మికులు దేవుడిలాంటి ఆయనను వదల్లేక వదిలిపోయారు. ఎప్పటికైనా తన సరుక్కు మార్కెట్‌లో గుర్తింపు లభిస్తుందన్న ఆశతో ఉన్నాడాయన - నాకు అన్నం పెట్టిన దేముడాయన.

మొదట్లో నేను ఆయన ఫ్యాక్టరీలో డైలీవేజ్‌తో పని చేసేదాన్ని. ఇవాళ పరిస్థితి ఏంటో తెల్సా ..... ఒక పదివేల కోసం వచ్చాడు. అడగలేక అడిగాడు" చెప్పటం అపింది వనజాక్షి భారంగా.

అదే సమయంలో బోయ్ లోనికొచ్చాడు. బ్యాంక్ నుంచి తను తీసుకొచ్చిన క్యాష్‌ను టేబిల్‌మీద పెట్టి వెళ్ళిపోయాడు. కాసేపు ఆలోచనలో పడింది మహతి.

"ఆయనిక్కడ ఎక్కడుంటున్నారు, మేడమ్ ..... " చెప్పిందావిడ.

"నేనొకసారి ఆయనతో మాట్లాడతాను మేడమ్" ఆ మాటకు వనజాక్షి మహతివేపు ఆశ్చర్యంగా చూసింది.

ఎందుకు, ఏమిటని అడగలేదు వనజాక్షి. దానికి మహతిమీద ఏర్పడిన కాన్ఫిడెన్స్ కారణం.

*　　　　*　　　　*　　　　*

"వనజాక్షి గారు మీకివ్వమన్నారండి" ఆ డబ్బును ఆయన చేతిలో పెట్టేసి కూర్చుంది మహతి.

"చేసిన ఉపకారాన్ని వెంటనే మర్చిపోయే ఈ రోజుల్లో, ఎప్పుడో నా దగ్గర పనిచేసిన కృతజ్ఞతతో నేనడగ్గానే డబ్బు సహాయం చేసింది. వనజాక్షి చేసిన మేలును మర్చిపోలేనమ్మా ..... నా ఆఖరి కూతురు పెళ్ళికి ఓ పదివేలు తక్కువ పడ్డాయమ్మా ..... ఆప్తులనుకున్న వాళ్ళందరూ చేతులెత్తేసారు. ఆఖరికి దైవఘటన " ఏ మాత్రం ఆత్మవంచన లేకుండా చెప్పి ఆ డబ్బును తన జేబులో పెట్టుకున్నాడాయన.

"సర్ మీరేమీ అనుకోకపోతే ఒక ప్రశ్న -- మీగురించి వనజాక్షి గారు అంతా చెప్పారు. ముఖ్యంగా క్లాత్ ఇండస్ట్రీలో మీ పేరు, మీ ఫాబ్రిక్స్ పేరు గురించి" ఏదో చెప్పబోయిన మహతికి మధ్యలో అడ్డొచ్చాడాయన.

"ఏం పేరమ్మా-- అంత పేరొచ్చింది కాబట్టే పూర్తిగా మునిగిపోయాను. ఇవాల్టి సొసైటికి క్వాలిటీ అక్కర్లేదమ్మా ..... గాలివాటు ఫ్యాషన్లకు ఎదురు పరుగెడుదామనుకుని బోర్లా పడిపోయాను" నిర్లిప్తంగా అన్నాడాయన.

"అన్నీ తెల్సి మీరెలా నష్టపోయారు సర్."